క్లుప్తంగా

ధర్మ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న శ్రీనివాస్

తిరుమలగిరి : ధర్మ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పేరాల శ్రీనివాస్ కోరారు. గురువారం తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్పటి శ్రీనివాస్, ఏపూరి అయిలయ్య, సందీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

భవనం నిర్మించాలని వినతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలకు సొంతభవనం నిర్మించాలని ఎస్సీ గురుకుల విద్యాలయ సంస్థ రాష్ట్ర కార్యదర్శి సీతాలక్ష్మిని కలిసి విన్నవించినట్లు పీపీఎల్ వ్యవస్థాపకుడు మచ్చ నర్సయ్య తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. సొంత భవనాలు నిర్మించే ప్రక్రియలో భాగంగా తొలుత ఇక్కడి భవనానికి నిధులు మంజూరు చేసి నిర్మించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

సెంట్రల్ లైట్లు వెలిగించాలని డీఈఈకి వినతి

అర్వపల్లి : అర్వపల్లిలో రెండు జాతీయ రహదారులపై సెంట్రల్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల విభాగం డీఈఈని కోరినట్లు సీపీఎం డివిజన్ నాయకుడు కొప్పోజు యాదగిరి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వారం రోజుల నుంచి లైట్లు సరిగా వెలగక హైవే రోడ్లు, వీధులు అంధకారంగా మారాయని చెప్పారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

అర్వపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జీడి సుందర్ కోరారు. గురువారం తిమ్మాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మల్లేష్ ముందుండి పోరాడారని చెప్పారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ వైఫల్యాలను ప్రతి ఓటరుకు తెలియజేసి మల్లేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ నోముల రమేష్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ బూర్గుల రాంబాబు, జీడి నర్సయ్య, బ్రహ్మచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడి మృతి



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ మామిడి అనిత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు నారాయణ రామచంద్రారెడ్డి(61) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. గురువారం ఆయన మృతదేహానికి జెడ్పీటీసీ మామిడి అనిత నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, మామిడి అంజయ్య, సత్యనారాయణరెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేయాలి

సూర్యాపేట : భక్తులకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తలు, భక్తులు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యానగర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో చంద్రారెడ్డి అనే వ్యక్తి 50ఫీట్ల ప్రభుత్వ రోడ్డును ఆక్రమించాడని తెలిపారు. అంతేకాకుండా ఆ భూమిలో రేకుల షెడ్డు నిర్మించాడని, దీంతో దేవాలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వినపత్రం అందజేసిన వారిలో ధర్మకర్తలు, భక్తులు, తదితరులు ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

చివ్వెంల : తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని బి. చందుపట్ల గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శిగ తిర్పయ్య రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశత్తూ మోకు జారి చెట్టుపై నుంచి కింద పడ్డాడు. దీంతో అతడి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

సమస్యల లోగిలిలో పుస్తకాలయం

- సౌకర్యాలకు నోచుకోని జాజిరెడ్డిగూడెం గ్రంథాలయం
- భవన నిర్మాణం పూర్తయినా.. పెండింగ్‌లోనే మిగతా పనులు
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు



జాజిరెడ్డిగూడెం గ్రంథాలయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఈ గ్రంథాలయానికి రోజు రోజుకూ పాఠకుల సంఖ్య పెరుగుతున్నా కనీస వసతులు కొరవడ్డాయి. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రంథాలయానికి భవనాన్ని సుమారు రూ.10 లక్షలతో నిర్మించారు. కానీ ఇంకా కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

కొరవడిన కనీస వసతులు..

గ్రంథాలయంలో కనీస వసతులు కొరవడ్డాయి. ఫర్నిచర్ సమకూర్చలేదు. ఏదో దాతలు ఇచ్చిన కొద్దిపాటి ఫర్నిచర్‌తో వెళ్లదీస్తున్నారు. బల్లాలు, కుర్చీలు సరిపోను లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. నిధుల లేమితో మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. నీటి వసతి కూడా లేదు. బోరు వేసి ట్యాంక్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. భవనం పైభాగంలో కంటి గోడ నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీళ్లు కిటికీలలో నుంచి భవనంలోకి చేరుతోంది. దీంతో పుస్తకాలు, పత్రికలు తడిచిపోతున్నాయి. వర్షాకాలమైతే పాఠకులు లోపల కూర్చొని చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. నూతన భవన నిర్మాణం జరిగినప్పటికీ ఇంతవరకు రంగులు వేయలేదు. గ్రంథాలయం ముందుభాగంలో సీసీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పాఠకులు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి



జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరుగుతున్నా కనీస వసతులు లేవు. గ్రంథాలయంలో అభివృద్ధి పనులు చేపడితే పాఠకుల సంఖ్య మరింత పెరుగుతుంది. నీటి వసతి కల్పించి మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలి.

– చెన్నబోయిన శివన్, పాఠకుడు

పనులను పూర్తిచేయాలి



గ్రంథాలయంలో నిలిచిపోయిన అసంపూర్తి పనులను పూర్తిచేసి మోడల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దాలి. ఇక్కడి గ్రంథాలయానికి ఎంతో పేరు ఉన్నా అభివృద్ధి కావడంలేదు. వెంటనే సమస్యలను పరిష్కరించాలి.

– సతీష్, పాఠకుడు

పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి



పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. దాతల సహకారంతో కొన్ని పుస్తకాలు, కంప్యూటర్ సమకూర్చడం జరిగింది. గ్రంథాలయ అభివృద్ధి పనుల కోసం ఇదివరకే ప్రతిపాదనలు కూడా పంపించడం జరిగింది.

– దార శ్రీనివాస్, లైబ్రేరియన్

రెండవ రోజూ కొనసాగిన బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా వేదపండితులు శ్రీమాన్ అరవిందచార్యులు, సుబ్రహ్మణ్యాచార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వస్తివాచనం, విన్నపాలు, బాలభోగం, తీర్థ గోష్టి, నిత్యహోమం, శ్రీసుదర్శన నారసింహహోమం, స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణమోహన్, ఆదుర్తి రామయ్య, మురళీ క్రిష్ణ, యలగబోయిన శ్రీరాములు, శంకరాచారి, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు దరఖాస్తుకు అవకాశం

- కొత్తగా ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15 వరకు గడువు



తిరుమలగిరిలో ఓటు వేయడానికి బారులుదీరిన ప్రజలు (ఫైల్)

తిరుమలగిరి : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. అధికారులు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరోవైపు కొత్తగా ఓటు నమోదు, జాబితాల మార్పులు, చేర్పుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఏప్రిల్ 15 వరకు గడువు ఇచ్చింది. ఇప్పటికే ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా విడుదలైంది. దీని ప్రకారం తుంగతుర్తి నియోజకవర్గంలో 2, 57, 999 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,28,240మంది, మహిళలు 1,29,752 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు..

కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం 8 ద్వారా ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని బీఎల్‌ఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఓటర్లు ప్రస్తుత ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకున్న తర్వాతే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఫారం 12డీ.. ఇంటి వద్దే ఓటు

నియోజకవర్గంలో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే విధానానికి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీకారం చుట్టారు. వికలాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల అధికారులు పోలింగ్ కంటే ముందే ప్రత్యేక వాహనంలో ఇంటికి వచ్చి కంపార్ట్‌మెంట్‌లో బ్యాలెట్ ద్వారా వారితో ఓటేయిస్తారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు



కొత్తగా ఓటర్లుగా నమోదు కోసం ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మార్పులు, చేర్పులు ఉంటే కూడా చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా గాని, ఆఫ్ లైన్‌ద్వారా గాని దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

– రమణారెడ్డి, తహసీల్దార్, తుంగతుర్తి

మహిళలే కీలకం..

తుంగతుర్తి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో వారి ఓట్లే ప్రభావం చూపనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే నియోజకవర్గంలో మొత్తం 2982మంది ఓటర్లు పెరగగా.. వీరిలో 1512 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు



నాగారంలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి అశోక్

దురాజ్‌పల్లి : జిల్లాలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధితశాఖ అధికారులను కలెక్టర్ వెంకటరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై మున్సిపల్, మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారుల పరిశీలనలో గుర్తించిన సమస్యలపై ఇచ్చిన నివేదిక ఆధారంగా మిషన్ భగీరథ అధికారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఎస్సీ వెంకటేశ్వర్లు, ఈఈలు అరుణాకర్ రెడ్డి, శ్రీనివాసరావు, డీఈ అభినయ్, రాజేందర్, విద్యుత్ శాఖ ఎస్‌సీ పాల్‌రాజ్, ఆర్డీఓ కోదాడ సూర్యనారాయణ, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటరావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో అధికారులతో కలిసి మాట్లాడారు. ఎస్‌డీఎఫ్, గ్రామ పంచాయతీ నిధులతో గ్రామాల్లోని తాగునీటి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు, చేతిపంపులు మరమ్మతులు చేసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రతి మండలానికి ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి, డీఈఓ అశోక్ అన్నారు. గురువారం నాగారం మండల కేంద్రంతో పాటు, వర్ధమానుకోట, నాగారంబంగ్లా గ్రామాల్లో పర్యటించి ఓవర్ హెడ్ ట్యాంకులు, ఓపెన్ వెల్స్, బోరు బావులను సందర్శించి మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలపై గ్రామస్తులను, మండల అధికారులను, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాగారం బంగ్లాలోని జీపీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయనతోపాటు ఎంఈఓ బి. బాలునాయక్, ఎంపీడీఓ శోభారాణి, కార్యదర్శులు శోభన్‌బాబు తదితరులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కోదాడరూరల్ : వీధి వ్యాపారులు ఫుట్ పాత్‌ను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ హెచ్చరించారు. కోదాడ పట్టణంలో పలు చోట్ల ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను గురువారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన తొలగించి మాట్లాడారు. వీధి వ్యాపారులు తమ జీవనం సాగేందుకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి కానీ ఫుట్‌పాత్‌లను, రోడ్డును ఆక్రమించొద్దని అన్నారు. ఫుట్‌పాత్‌ను అక్రమిస్తే పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోందని, దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. అంతేకాకుండా ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం కలుగుతుందని అన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ కొంగర వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ ఖయ్యూం, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి చక్రస్నానం



సీతారామచంద్రస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

నాగారం : ఫణిగిరి గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి చక్రస్నానతీర్థం, పూర్ణహుతి, అగ్నిహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు సీతారామచంద్రస్వామి ఊరేగింపు నిర్వహించారు. దూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కె.సంతోష్ కుమార్ ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతనకల్ : స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆత్మకూరు మండలం ఏపూర్‌లో శుక్రవారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పిడమర్తి భరత్ కోరారు. గురువారం మండల కేంద్రంలో వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నిర్వహించిన పోరాట స్ఫూర్తితో అనేక మంది భారతీయులు స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం పోరాడినట్లు ఆయన తెలిపారు. బ్రిటీష్ పాలకులు ముగ్గురు వీరులను హతమార్చడం హేయమైన చర్యని అన్నారు. వారి ఆశయ సాధనకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పోరాటాలు నిర్వహించడం వల్లే స్వాతంత్ర్యం సిద్ధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు వెంకటేష్, మనోజ్, శివ, గోపి, బన్ని, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని లైట్లు.. అంధకారంలో వైజంక్షన్



అంధకారంగా మారిన అర్వపల్లి వైజంక్షన్

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులు కలిసే ప్రాంతమైన అర్వపల్లిలోని వైజంక్షన్ అంధకారంగా మారింది. అయితే ఈ జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్ల నిర్వహణ చూసే కాంట్రాక్టర్ గడువు ముగియడంతో సమస్యలు మొదలయ్యాయి. ఇప్పటికే జనగామ, సూర్యాపేట, తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం రూట్లలో కొన్ని సెంట్రల్ లైట్లు కొద్ది రోజులుగా వెలగడం లేదు. దీనికి తోడు వైజంక్షన్‌లోని లైట్లు కూడా రెండు రోజులుగా వెలగక పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ హైవే రోడ్లతో పాటు జంక్షన్ నుంచి ప్రతిరోజు వేల సంఖ్యలో వాహనాలు వచ్చిపోతుంటాయి. వైజంక్షన్‌లో లైట్లు పనిచేయక స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని హైవేపై, వైజంక్షన్‌లో సెంట్రల్ లైట్లు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం

కోదాడరూరల్ : వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి కోదాడ పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని సంఘం చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుడిబండలో నిర్వహించిన కోదాడ పీఏసీఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గుడిబండలో నూతన ఎరువుల గోడౌన్ నిర్మాణానికి బాలాజీ నగర్‌లో స్థలం సేకరణ, గోడౌన్ నిర్మాణం, తదితర అంశాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్‌లు పార్వతి, వెంకటేశ్వర్లు, గోబ్రా, కమతం వెంకటయ్య, శ్రీనివాసరావు, చంద్రమౌళి, సీతారామయ్య, ప్రభాకర్‌రావు, కాసాని రమాదేవి, బాబు, రైతులు వరప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కోదండరాంరెడ్డి, అలివేలుమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



తుంగతుర్తి : మాట్లాడుతున్న నాయకులు



అర్వపల్లిలో బాణసంచా కాలుస్తున్న నాయకులు

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా చామల కిరణ్‌రెడ్డికి టికెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ పార్లమెంట్ నాయకులు, టౌన్ కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని తుంగతుర్తి నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశాన్ని పరిపాలించడంలో మోదీ వైఫల్యం చెందారని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు పెద్దబోయిన అజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రాంమూర్తి, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ కొండరాజు, నాయకులు మాచర్ల అనిల్, బొంకూరి రమేష్, తడకమల్ల పరశురాం, ఎండీ అబ్దుల్, అక్కినపల్లి నరేష్, దీప్లా నాయక్, భూక్య మధు, బానోత్ బాలు, భూక్య మల్లు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టికెట్ ఇవ్వడం హర్షణీయం

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను చామల కిరణ్ కుమార్‌రెడ్డికి కేటాయించడం హర్షణీయమని జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడు కాసర్ల గణేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడే కార్యకర్తలకు న్యాయం జరుగుతుందనడానికి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వడమే నిదర్శనమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది దేశంలో అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భువనగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

చామల ఎంపికపై సంబురాలు

అర్వపల్లి : భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించడం పట్ల డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని పేర్కొన్నారు. అర్వపల్లిలో బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిర్శనపు కృష్ణమూర్తి, కొమారి మల్లయ్య, కొప్పోజు అశోక్, పి. సురేందర్, అలువాల వెంకటస్వామి, చిల్ల సైదులు, ఇమ్మడి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మద్దిరాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బొలెరో వాహనంలో వెళ్తున్న ఆత్మకూరు మండలం కొత్తతండాకు చెందిన బి.చిన్న వెంకన్న, బి.నర్సింహ, బానోతు మున్యాలు వద్ద మొత్తం రూ.1,53,000లు ఉండగా.. ఆ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలను చూపించి నగదును తీసుకెళ్లాలని పోలీసులు వారికి సూచించారు. తనిఖీల్లో ఎఫ్‌ఎస్‌టీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కొమ్మాలలో పశు వైద్యశిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాలలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, వీఎల్‌ఓ కేఎస్‌ఎస్.పద్మ, యాకయ్య, గోపాలమిత్రులు ఆల్డాస్ లింగయ్య, కుంభం సురేందర్, అర్జున్, రైతులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఆక్రమణ



మాట్లాడుతున్న ఆర్‌ఐ మట్టయ్య

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్లలో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గ్రామస్తులు గురువారం ఆక్రమించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో 125 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించారు. గత సంవత్సరం అక్టోబర్‌లో మండల కేంద్రంలోని రైతు వేదికలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ నేటి వరకు ఇళ్ల కేటాయింపు చేయకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆక్రమించుకున్నారు. ఈ విషయం తెలుసున్న ఆర్‌ఐ మట్టయ్య అక్కడకు చేరుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఖాళీ చేయాలని వారిని కోరారు. ఇళ్లను ఖాళీ చేసేది లేదని, కలెక్టర్ వద్దకు వెళ్తామని నిరుపేదలు తెలిపినట్లు ఆర్‌ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని లారీ బోల్తా



ట్రాన్స్‌ఫార్మన్‌ను ఢీకొట్టిన లారీ

నూతనకల్ : ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జె. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మల్లంపల్లి నుంచి ఏపీ 39 పీవై 5477 అను నంబర్ గల లారీ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి మట్టితో వస్తోంది. ఈ క్రమంలో నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ క్రాస్‌రోడ్డు సమీపంలోకి రాగానే లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నేల కూలింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని ఎస్‌ఐ తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్‌ఆర్‌కే మూర్తి

కోదాడఅర్బన్ : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది శ్రీనివాసుల రాధాకృష్ణమూర్తి (ఎస్‌ఆర్‌కెమూర్తి) ఎన్నికయ్యారు. గురువారం కోదాడ బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో నాళం రాజన్నపై ఎస్‌ఆర్‌కే మూర్తి 59 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 106 ఓట్లకు గాను ఒక ఓటు చెల్లకపోవడంతో మిగిలిన 105 ఓట్లలో రాధాకృష్ణమూర్తికి 82 ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థి రాజన్నకు 23 ఓట్లు వచ్చాయని తెలిపారు. అదే విధంగా క్రీడ కార్యదర్శిగా పోలూరి హేమలత 18 ఓట్ల మెజార్టీతో, 1వ కార్యవర్గ సభ్యుడిగా దొడ్డ శ్రీధర్ 8 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ప్రధాన ఎన్నికల అధికారి వి.రంగారావు, ఉప ఎన్నికల అధికారి షేక్ జానీపాషా, సహాయ ఎన్నికల అధికారి ఆవుల మల్లికార్జున్ రావు తెలిపారు. కాగా, ఉపాధ్యక్షుడిగా గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట్ల రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సరికొండ హనుమంతరాజు, కోశాధికారిగా కోడూరు వెంకటేశ్వరరావు, గ్రంథాలయం కార్యదర్శిగా మందా వెంకటేశ్వర్లు, మహిళా ప్రతినిధిగా ఓరుగంటి ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా సామా నవీన్‌కుమార్, షేక్ నారుల్‌పాషాలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.



కోదాడలో ఎస్‌ఆర్‌కే మూర్తి, రామిరెడ్డిలను సత్కరిస్తున్న న్యాయవాదులు

సహకార సంఘం అభివృద్ధికి కృషి

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నడిగూడెం సంఘం చైర్మన్ కొల్లు రామారావు తెలిపారు. గురువారం మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన ఆ సంఘం మహాజన సభలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులైన రైతులందరికీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, సంఘం లాభ, నష్టాలపై సంఘం సీఈఓ యలమందరావు నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ గుండెపూరి రాములు, డైరెక్టర్లు పాల్గొన్నారు.